క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం

నరసాపురం: వార్డుల్లో పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. శుక్రవారం ఆమె కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి పట్టణంలోని 8వ వార్డుల్లో పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వార్డులో డ్రెయిన్లను ప్రతిరోజూ శుభ్రం చేయాలని చెప్పారు. వార్డులో రోడ్డు మార్జిన్లలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంపై శానిటేషన్ అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, స్థానిక కౌన్సిలర్ బర్రి జయరాజు ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు హెల్ప్‌డెస్క్

నరసాపురం: వైఎన్ కళాశాలలో శుక్రవారం డిగ్రీ ప్రవేశాలకు గాను విద్యార్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. డిగ్రీ ప్రవేశానికి సంబంధించి మొదటి అప్లికేషన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏపీవీ అప్పారావు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తిచేసి డిగ్రీలో చేరాలనుకునే వారి కోసం ఈ హెల్ప్‌డెస్క్ ప్రారంభించినట్టు డీన్ గంధం శ్రీరామకృష్ణ చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ కనరావు, ఆర్.పార్థసారథి, సూపరింటెంట్ తోట ఏడుకొండలు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రామన్నపాలెం, నవుదూరుగరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెంలో పంట బోదె తవ్వకం పనులు చేపట్టినట్టు ఏపీవో వై శ్రీనివాస్ తెలిపారు.

ద్రాక్ష జ్యూస్ పంపిణీ

పాలకొల్లు అర్బన్: బాటసారులకు చల్లటి ద్రవాలు అందిస్తూ దాహార్తి తీరుస్తున్నామని శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గాదె వెంకన్న అన్నారు. 5 రోజుల క్రితం ఆలయ సమీపంలోని మెయిన్‌రోడ్డులో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెంకన్న తెలిపారు. శుక్రవారం బాటసారులకు ద్రాక్ష జ్యూస్ అందించారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, రాయపూడి భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

గోదావరి మాతకు హారతులు



సిద్ధాంతం వశిష్టాగోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

పెనుగొండ: హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతంలో వశిష్టా గోదావరికి శుక్రవారం రాత్రి పంచ హారతులను అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం చండీహోమం నిర్వహించారు. భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 25 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు.

త్వరలో అడ్మిషన్లు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతి త్వరలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి శుక్రవారం తెలిపారు. బీఎస్సీ గ్రూప్ ఎంపీసీ, ఎంపీసీఎస్ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), ఎంసీసీఎస్ (మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్), ఎంఎస్‌డీఎస్ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్), బీజెడ్‌సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), హెచ్‌బీసీ (హార్టికల్చర్, బోటనీ, కెమిస్ట్రీ), ఏటీజెడ్‌సీ (ఆక్వా కల్చర్ టెక్నాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ) విభాగాలు ఉన్నాయన్నారు. పూర్తి వివరాల కోసం అడ్మిషన్ కన్వీనర్ సెల్ : 9143839999, బీఎస్సీ మ్యాథ్స్ కోసం సెల్: 8639093289, బీఎస్సీ బయాలజీ కోసం సెల్: 9849240767 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

నరసాపురం: స్థానిక కప్పలపేటలో అడారి భారతి ఇంటి తాళం పగలుగొట్టి బీరువాలోని మూడున్నర కాసుల బంగారు గొలుసును దొంగలు అపహరించారు. దీనిపై టౌన్ ఎస్సై కె.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండురోజుల క్రితం భారతి బంధువుల ఇంటికి వేరే ఊరు వెళ్లింది. శుక్రవాం మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చి చూడగా ఇంటి తాళం పగలుకొట్టి బీరువాలో బంగారు వస్తువు పోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై చెప్పారు.

వృద్ధుడికి స్వల్పగాయాలు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – భీమవరం జాతీయ రహదారిలో శివదేవునిచిక్కాల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పీతల ఆనందరావు (70) అనే వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో స్వల్పగాయాల పాలయ్యారు. ఆనందరావు పనులు ముగించుకుని తన స్వగ్రామం బల్లిపాడు గరువు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు ఆనందరావును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై సరిదే శ్రీనివాసరావు తెలిపారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లు



పాలకొల్లు మండలం దగ్గులూరులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఏవో షేక్ అబ్దుల్ రహీం



శుక్రవారం పెనుగొండలో భారీ వర్షానికి బరకాలతో కప్పిన ధాన్యం రాసులు

పాలకొల్లు అర్బన్: అకాల వర్షాల కారణంగా రైతుల నుంచి ధాన్యం ఆఫ్‌లైన్ విధానంలో కొనుగోలు చేస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం వెల్లడించారు. మండలంలోని దగ్గులూరు, గవరపేట, లంకలకోడేరు, వెంకటాపురం, అరట్లకట్ల, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. అకాల వర్షాల కారణంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ముందుగా రైతు భరోసా కేంద్రంలో ఆఫ్‌లైన్ ప్రొఫార్మా తీసుకుని అందులో వివరాలు నమోదు చేసి రైస్ మిల్లుకి ధాన్యం తీసుకువెళ్లి, అక్కడ అన్‌లోడ్ చేసిన తరువాత తిరిగి ఆ ప్రొఫార్మాను ఆర్‌బీకేల్లో అందజేయాలని సూచించారు. రైతులు ఆఫ్‌లైన్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎడతెరపి లేకుండా భారీ వర్షం

పెనుగొండ: వాతావరణంలో మార్పులతో శుక్రవారం ఆచంట నియోజకవర్గంలో భారీ వర్షం ఎడతెరపి లేకుండా రెండు గంటల పాటు భారీగా కురిసింది. ఉదయం కాస్త ఎండరాగానే కొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ప్రయత్నించారు. ఇంతలోనే కారుమబ్బులు వ్యాపించడంతో బరకాలతో ధాన్యాన్ని కప్పుకొని రక్షించుకున్నారు. 12 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ రైతులకు సూచనలందిస్తున్నారు.

భారీ వర్షాలతో ధాన్యం మాసూళ్లకు అంతరాయం

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని అన్ని గ్రామాల్లోను ఏప్రిల్ 29 నుంచి ప్రతి రోజు ఏదొక సమయంలో భారీ వర్షం కురవడంతో వారంరోజులుగా రైతులు ధాన్యం మాసూళ్లకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటి వరకు మాసూళ్లు చేసిన ధాన్యం రాశులు, బస్తాలు, రోడ్ల పక్కనే ఉండటంతో వర్షంనీటికి తడిసి మొలకలు వస్తున్నాయి. మండలంలో 12,201 ఎకరాలలో వరిసాగు ఉండగా ఇప్పటి వరకు 4,650 ఎకరాలలో వరికోతలు పూర్తిచేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ఏ జ్యోత్స్న తెలిపారు. ఇప్పటి వరకు 1,210 మంది రైతుల నుంచి



నత్తారామేశ్వరంలో ధాన్యం బస్తాలను లారీకి ఎగుమతి చేస్తున్న కూలీలు

8,487 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రైసు మిల్లులకు రవాణా చేసినట్లు ఆమె తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతీ బస్తాను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని ఆమె తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ధాన్యం మాసూళ్లకు అవకాశం లేక పోగా, శుక్రవారం నుంచి భారీ వర్షం కురవడంతో చేలల్లో నీరు నిలిచింది. వరి నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు

పాలకొల్లు అర్బన్: చెత్త నుంచి సంపద తయారు చేసుకుని పంచాయతీ ఆదాయాలను పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు సూచించారు. జిల్లా పంచాయతీ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన పాలకొల్లు మండలం లంకలకోడేరులో శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి గ్రామంలోని సంపద కేంద్రాలపై ఆరా తీశారు. అనంతరం లంకలకోడేరు గ్రామ సచివాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు డీపీలో మల్లికార్జునరావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ షేక్ అహ్మద్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా), సీతారామరాజు, డీఎస్ పద్మాజీరావు, ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), లింగం సత్యనారాయణ, మల్లేశ్వరరావు, కె కాశీ విశ్వనాథం, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైశాఖ పౌర్ణమి ప్రత్యేక పూజలు



నత్తారామేశ్వరంలో రామలింగేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెనుమంట్ర: వైశాఖ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి, విజయదుర్గాదేవి, పెనుమంట్రలోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ మాసంలో నెలరోజులు మాత్రమే దర్శనమిచ్చే నత్తారమేశ్వరంలోని పరశురామ ప్రతిష్ఠ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతి అమ్మవారికి, విజయదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేసారు. నత్తారామేశ్వరం ఆలయంలో ద్వారంపూడి వీరసత్యనారాయణరెడ్డి, లలితా దంపతులు ఆలయాలకు వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేసారు. గ్రామంలోని కొండాలమ్మ వారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తుల సహకారంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పెనుమంట్రలోని కనకదుర్గమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులతో నత్తారామేశ్వరం ఆలయంలో రద్దీ ఏర్పడింది.

అభివృద్ధి దిశగా సమన్వయంతో పనిచేయాలి



సర్పంచ్‌లు, అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని పనిచేసి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగుల సమీక్ష సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. అధికారుల పర్యటనలు, ఇతర సమస్యలు ప్రజా ప్రతనిధుల దృష్టికి తీసుకువెళ్లాన్నారు. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రొటోకాల్ ప్రకారం మర్యాదగా నడచుకోవాలని సూచించారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పట్టాలు, ఇంటి నిర్మాణాలు, తాగునీటి సమస్య, విద్యుత్, డ్రెయిన్లు, సీసీ రోడ్లు తదితర సమస్యలపై అధికారులు ప్రజాప్రతినిధుల సూచనల మేరకు పనిచేయాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు వ్యతిరేకంగా పనిచేసే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, వైస్‌ఎంపీపీ పడవల సునీల్‌బాబు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, మండల పార్టీ కార్యదర్శి పెన్మెత్స ఏసురాజు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, డిప్యూటీ తహసిల్దార్ డేవిడ్, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పెనుగొండ: రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షాలకు పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారన్నారు. నిత్యం రాజకీయం చేయడమే పనిగా పెట్టుకొని చంద్రబాబు రైతులను మోసం చేసేవిధంగా రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని సైతం అన్ని రైసుమిల్లులతో దిగుమతి చేసుకునే విధంగా కొనుగోలు చేయాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు సమస్యలు పరిష్కారం కోసం అధికారులు కృషి చేస్తున్నారన్నారు.

హనుమజ్జయంతి శోభాయాత్ర పోస్టర్ విడుదల

పాలకొల్లు సెంట్రల్: విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హనుమజ్జయంతి శోభాయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు తటవర్తి కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేగేటు వద్ద సరస్వతి శిశుమందిర్‌లో హనుమాన్ జన్మదినోత్సవ శోభాయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 14న హనుమజ్జయంతి పురస్కరించుకుని స్థానిక యడ్ల బజారు సెంటర్ శ్రీ పంచముఖ అంజనేయస్వామి ఆలయం నుండి సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. టి. సునీత, అఖిల్, భరత్, సూరిబాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

పాఠశాలలకు గ్లాసుల వితరణ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగి జావ పంపిణీ కోసం ప్రభుత్వం పాఠశాలలకు గ్లాసులను అందజేసింది. శుక్రవారం బీఆర్‌ఎంవీ ఉన్నత పాఠశాలలో పాఠశాలల క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ)లు ప్రధానోపాధ్యాయులకు గ్లాసులు అందజేశారు. పట్టణం, పాలకొల్లు మండలంలో ఉన్న 97 ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మొత్తం 8,600 గ్లాసులను అందించారు. సీఆర్పీలు బి రామకృష్ణ, రాజరాజేశ్వరి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డీవీ నరసింహారావు, నరసింహరావు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

రేపు గీతామందిర నిర్మాణానికి శంకుస్థాపన

ఉండి: చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గీతామందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు కార్యక్రమం ఆర్గనైజర్ సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు. తమ్మినాన రామన్న, మహంకాళమ్మ కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

కోట సత్తెమ్మకు జలాభిషేకం



దొడ్డిపట్ల వశిష్ట గోదావరి నుంచి ఇలపకుర్రు కోట సత్తెమ్మ ఆలయానికి 108 కలశలతో గోదావరి జలం తీసుకువస్తున్న మహిళలు

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో వెలసిన కోట సత్తెమ్మ అమ్మవారి 21వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం దొడ్డిపట్ల వశిష్ట గోదావరి నుంచి 108 ముత్తయిదవలు 108 కలశములతో గోదావరి పుణ్య జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. గోదావరి నుంచి ఆలయానికి వచ్చే వరకు కలశలతో వస్తున్న ముత్తయిదవలకు చీరలు పరచి వాటిపై నడిపించుకుంటూ గోదావరి జలాలను ఆలయానికి తీసుకువచ్చారు. గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం చేసిన అనంతరం సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులను అందజేశారు. రాత్రి సువర్ణ, రజత, వస్త్ర, పూల ఆభరణములతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం గరగల నృత్య ప్రదర్శన, దూబచర్ల వారిచే 28 రకాల శక్తి వేషధారణలతో నవదుర్గా కాళికా నృత్య ప్రదర్శన, శివపార్వతుల కాంబినేషన్‌తో అఘోరా నృత్యం, కేరళ డ్రమ్మర్స్, డీజే సౌండ్స్, హైటెక్ విద్యుద్దీపాలంకరణ, బాణ సంచా కాల్పుల మధ్య అమ్మవారి జాతర కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.10వ తేదీ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి

నరసాపురం: ప్రతీ ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని త్రిదిండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామీజీ సూచించారు. పట్టణంలోని ప్రసిద్ధ ఆదికేశవ ఎంబేరుమానార్ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామచంద్ర రామానుజ స్వామీజీ శుక్రవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఎంబేరుమానార్ కోవెల విశిష్టతను వివరించారు. అనంతరం పుప్పాల వెంకటకృష్ణమోహన్ రాసిన అభినవ భూతపురి వైభవం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పండితులు సముద్రాల శఠగోపాచార్యులు, కిడాంబి వెంకటార్యులు, ఈయుణ్ణి లింగాచార్యులు, వెంటళ వెంకటాచార్యులు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పుప్పాల వెంకటకృష్ణ, ఈవో చాగంటి సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో చెక్‌బౌన్స్, కుటుంబ తగాదా వంటి రాజీ ఆమోదయోగ్యమైన అన్ని కేసులను రాజీ చేసుకోవచ్చున్నారు. రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

ఆలయం వద్ద అగ్ని ప్రమాదం

పెనుమంట్ర: మార్టేరులో నడివీధిలో కొలువైన పోలేరమ్మ పూరిగుడిలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పూడిగుడి శిఖరం నుంచి పొగలు వస్తుండటంతో స్థానికులు చూసి మంటలను అదుపు చేసారు. భక్తులు వెలిగించిన దీపాల వల్ల ఈప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

పాడి రైతులకు రూ.26 లక్షల సబ్సిడీ పంపిణీ

పాలకొల్లు అర్బన్: పాడి రైతులను ప్రోత్సహించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక రకాల రాయితీలు కల్పిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం గోరింటాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 40 మంది పాడి రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.26 లక్షల సబ్సిడీని శుక్రవారం శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన కవురు శ్రీనివాస్‌ను సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు వర్ధినీడి విజయ శ్రీనివాస్, సర్పంచ్ మండెల పావని తదితరులు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు వర్ధినీడి విజయ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మండెల పావని, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు కోళ్ల కృష్ణారావు, మేడిది రాజబాబు, ఉప సర్పంచ్ దేనబోయిన అయ్యప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు మండెల నాని, పార్శి రాజబాబు, చేరుగొండి మణిరావు, చవ్వాకుల రామారావు, నక్కా సునీల్‌బాబు, చవ్వాకుల రాజేష్, మండెల ప్రసాద్, మండెల నరసింహరావు, వర్ధినీడి నారాయణరావు, మండెల మోహన శంకరరావు పాల్గొన్నారు.

హోమశాలకు శంకుస్థాపన

పెనుమంట్ర: మాముడూరులో అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో రూ. 2.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న హోమశాల నిర్మాణానికి శుక్రవారం ఆలయ అనువంశిక ధర్మకర్త బోగిరెడ్డి వీరాస్వామి దంపతులు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాట్ల గోపాలకృష్ణరాజు, కోసూరి రామకృష్ణంరాజు, బోగిరెడ్డి కోటేశ్వరరావు, బోగిరెడ్డి పాండురంగారావు ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు, వి సీతారామాచార్యులు, పాల్గొన్నారు.